భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 31.0

కనిష్ఠం : 25.0



తాళం వేసి ఉన్న గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం

ఆలయాలకు తాళం

చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయాల మూసివేత

సంప్రోక్షణ అనంతరం నేడు యథావిధిగా పూజలు 7



కోపల్లె సొసైటీ గొడౌన్‌లో ఎరువులు పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

యూరియాకు ఇబ్బంది లేదు

కలెక్టర్ నాగరాణి

కాళ్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియా అందిస్తున్నామని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టిలో పెట్టవచ్చని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కాళ్ళ మండలం కోపల్లె సొసైటీలో ఆదివారం యూరియా వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూరియాను ఎవరైనా అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వల్ల పంటకు ఎటువంటి ప్రయోజనం కలగదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. సొసైటీ చైర్మన్ నంద్యాల రామరాజు, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, ఏడీఏ కె.జీవనప్రతాప్, జి.సత్యనారాయణ,ఏవో పి.రమేష్ నాయుడు, దంతులూరి శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



మాధవాయిపాలెంలో ప్రయాణికులతో పంటు

పంటు పునరుద్ధరణ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఉభయగోదావరి జిల్లాల మధ్య నిలిచిన పంటు రాకపోకల్ని ఆదివారం నుంచి పునరుద్ధరించారు. గోదావరి వరదల కారణంగా ముందస్తుగా మండల పరిషత్ అధికారులు సఖినేటిపల్లి- మాధవాయిపాలెం రేవుల మధ్య పంటు రాకపోకల్ని నిలుపుదల చేశారు. దీంతో లంక ప్రజలు చించినాడ మీదుగా చుట్టుతిరిగి పట్టణానికి రావాల్సి వచ్చేది. ప్రస్తుతం వరద పూర్తిగా తగ్గుముఖం పట్టడం, మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించడంతో రెండు రేవుల మధ్య పంటు రాకపోకలకు అధికారులు అనుమతించారు. ఆదివారం నుంచి ఒక పంటు మాత్రమే తిప్పారు. పంటు తిరగడంతో స్టీమర్‌రోడ్ సందడిగా మారింది.

మూడోవిడతలో 12 మంది డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన మూడోవిడత అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆదివారం ఏలూరు డీఈవో కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి మొత్తం 12 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను శనివారం రాత్రి 10.30 గంటలకు విడుదల చేశారు. అభ్యర్థుల్లో ఏడుగురు దివ్యాంగులుండగా, వీరందరి వైకల్య శాతం నిర్ధారణకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం మెడికల్ బోర్డు ఎదుట హాజరు కావాలని సూచించారు.ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షించారు.

మార్కెట్ వాచ్

దిగివచ్చిన బెండ

పెరిగిన తెల్ల వంకాయలు



నిలకడగా మహారాష్ట్ర ఉల్లి ధరలు

ఉండి మండలంలో 144 సెక్షన్

» ఆటోతో పోలీసుల హెచ్చరిక ప్రచారం

ఒకే ఇంట.. రెండు రోడ్డు ప్రమాదాలు 7

» సోదరుడికి యాక్సిడెంట్ అయిందని వెళ్తుండగా తమ్ముడిని వెంటాడిన ప్రమాదం



తరగని గుట్టలు తప్పిన అంచనాలు!

తాడేపల్లిగూడెం స్టాక్ పాయింట్ వద్ద ఇసుక గుట్టలు

వర్షాకాలం అవసరాల కోసం ప్రభుత్వం ఇసుక నిల్వలు ఉండేలా చర్యలు తీసుకుంది.. వాటిని అమ్ముకునేందుకు కాంట్రాక్టర్లకు అప్పజెప్పింది.. ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుని కొంతమంది తమకే కాంట్రాక్టులు వచ్చేలా చూసుకున్నారు.. కానీ వారు అనుకున్నది ఒకటి.. అయిందొకటి.. ఇప్పుడు ఇసుక పాయింట్ల నుంచి కొనుగోలు చేసేవారే కరువయ్యారు.. తక్కువ ధరకే వస్తుండడంతో రీచ్‌ల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

"వర్షాకాలంలో నిర్మాణాలు ఆగకూడదు. అందరికీ ఇసుక అందుబాటులో ఉండాలి. స్టాక్ పాయింట్‌ల నుంచి భర్తీ చేయండి "అంటూ అధికారులు పదే పదే సమీక్షలు చేశారు. స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక అమ్మకాలకు కాంట్రాక్టర్‌లను ఖరారు చేశారు. దీనికోసం తొలుత కూటమి శ్రేణులు పోటీ పడ్డాయి. స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక అమ్మకం జరిపేలా తమకే కాంట్రాక్టర్ దక్కాలని అంతా ఎగబడ్డారు. కూటమి ఎమ్మెల్యేలకు అత్యంత సన్నిహితంగా ఉండే నాయకులు తమకే కాంట్రాక్ట్ దక్కేలా ఒత్తిడి చేశారు. ఏజన్సీ కోసం ప్రయత్నాలు చేసుకుంటున్న కూటమి శ్రేణులకు నచ్చచెప్పి కోరుకున్న వారికే కాంట్రాక్టులు ఇప్పించారు. కాంట్రాక్టులు దక్కించుకున్న వారు ఎంతో ఊహించుకున్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద గుట్టలుగా ఇసుక నిల్వలు ఉంచారు. వర్షాకాలంలో డిమాండ్ మేరకు అమ్ముకోవచ్చంటూ తహతహలాడారు. తీరా చూసేసరికి ఇసుక పాయింట్‌ల నుంచి కొనుగోలు చేసేవారు కరువయ్యారు. నిర్మాణదారులు కూడా ముందుగానే జాగ్రత్తపడ్డారు. వానా కాలంలో ఇసుకకు డిమాండ్ ఉంటుందన్న ఉద్దేశంతో వేసవిలోనే ఇసుక రప్పించుకుని నిల్వలు చేసుకున్నారు.

నిల్వ చేసుకున్న లారీ యజమానులు

ఇసుక సరఫరా చేసే లారీ యజమానులు కూడా వేసవిలోనే కొంత మొత్తంలో నిల్వలు చేసుకున్నారు. వాహనాలు అధికంగా ఉండే గ్రామాల్లో ఇసుక

స్టాక్ పాయింట్ల వద్ద అమ్మకాలు నిల్

ఒత్తిడి తెచ్చి మరీ కాంట్రాక్టులు ..

గుట్టలుగా ఇసుక నిల్వలు

రీచ్‌ల నుంచి రూ. 10 వేలకే ఆరు టన్నులు

పాయింట్ల వైపు చూడని నిర్మాణదారులు

కాంట్రాక్టర్లు లబోదిబో..

అధికారులపై కస్సుబుస్సు

గుట్టలున్నాయి. వాటిని అమ్మకాలు సాగిస్తూ వస్తున్నారు. తక్కువ ధరకే సరఫరా చేస్తున్నారు. మరోవైపు తూర్పుగోదావరి జిల్లా ఔరంగాబాద్ రీచ్ నుంచి ఇసుక సరఫరా అవుతోంది. దాంతో స్టాక్ పాయింట్‌ల నుంచి ఏ ఒక్కరూ ఇసుక కొనుగోలు చేయడం లేదు. అధిక రోజులు గుట్టలుగా ఇసుక నిల్వ చేస్తే నాణ్యత పోతుందున్న ఉద్దేశంతో నిర్మాణదారులు తాజా ఇసుకపైనే ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, ఉండి, పాలకొల్లు, నర్సాపురం, తణుకు, ఆచంట ప్రాంతాలకు అందుబాటులో ఉండేలా స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేశారు. అవసరాన్ని బట్టి ఇసుక నిల్వలు చేసుకున్నారు. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 37,500 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇతర స్టాక్ పాయింట్‌లలోనూ 10 వేల టన్నులకు పైగా నిల్వ చేశారు. ఒక్క లారీ కూడా అక్కడ నుంచి అమ్మకాలు సాగడం లేదు. స్టాక్ పాయింట్‌ల నిల్వలపై జిల్లా అధికారులు సైతం ప్రచారం చేశారు. ధరలను నిర్ణయించారు. అమ్ముకుందామంటే ఇప్పుడు కొనుగోలు చేసేవారు కరువయ్యారు.

అధికారులపై కస్సుబుస్సు

గ్రామాల్లో అక్రమ నిల్వల నుంచి ఇసుక అమ్మకాలు సాగిస్తుండడం వల్లే స్టాక్ పాయింట్‌ల వద్ద ఇసుక కొనుగోలు చేయడం లేదంటూ కాంట్రాక్టర్‌లు లబోదిబోమంటున్నారు. ఇసుక సరఫరా చేసే టిప్పర్ వాహనాలకు కొన్ని గ్రామాలు పేరుమోశాయి. అక్కడ నుంచి ఇసుక సరఫరా అవుతుందంటూ కాంట్రాక్టర్‌లు అనుమానిస్తున్నారు.వారి వెనుక ఉండి స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసుకున్న నాయకులు ఇప్పుడు అధికారులపై కస్సుబుస్సు లాడుతున్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక గుట్టలనుంచి అమ్మకాలు సాగిస్తుంటే ఏమి చేస్తున్నారంటూ అధికారులపై దురుసుగా మాట్లాడుతున్నారు. ఇసుక గుట్టలున్న గ్రామాల్లో పోలీసు గస్తీ కూడా పెట్టారు. అయినా సరే స్టాక్ పాయింట్ వద్ద అమ్మకాలు మాత్రం సాగడం లేదు. రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక రూ. 10వేలకే లభ్యమవుతోంది. అదే స్టాక్ పాయింట్‌ల వద్ద అయితే రూ. 12,500 వరకు ఉంటోంది. దాంతో నిర్మాణదారులు రీచ్‌ల నుంచి వచ్చే ఇసుక కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తానికి కాంట్రాక్టర్‌లు అంచనాలు తారు మారయ్యాయి. స్టాక్ పాయింట్‌లపై నమ్మకం పెట్టుకుని నష్టపోయారు.

రీచ్‌ల నుంచి సరఫరా

జిల్లాకు వానాకాలంలోనూ రీచ్‌ల నుంచి ఇసుక సరఫరా అవుతోంది. కాలువల ద్వారా బోటుల్లో ఇసుక తెచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. కేవలం రూ.10 వేలకే ఆరు యూనిట్‌లు ఇసుక మార్కెట్‌లో లభ్యమవుతోంది. తాడేపల్లిగూడెం ప్రాంతంలో ఇదే ధర పలుకుతోంది, అదే భీమవరం అయితే రవాణా చార్జీలు అధికంగా ఉండడంతో రూ. 14 వేల నుంచి రూ. 15 వేలకు అమ్మకాలు సాగిస్తున్నారు. అయినా అంతంత మాత్రంగానే కొనుగోలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇదే ఇసుక తాడేపల్లిగూడెంలో రూ. 14 వేలు, భీమవరంలో రూ. 22 వేలకు అమ్మకాలు సాగించేవారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇసుక ఎంత కావాలన్నా లభ్యమవుతోంది. స్టాక్ పాయింట్‌ల వద్ద అమ్మకాలు పడిపోయాయి.

బడుగులకు మరింత భరోసా



ఎన్టీఆర్ వైద్యసేవ పరిమితి రూ.25 లక్షలకు పెంపు

గతంలో రూ.5 లక్షల వరకే అవకాశం

క్యాబినెట్ ఆమోదంతో అంతటా హర్షం

జిల్లాలో 5.67 లక్షల కార్డుదారులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు ఆరోగ్యంపై మరింత ధీమా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ప్రతీ కుటుంబానికి రూ.25 లక్షల విలువైన వైద్యసేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రభుత్వ, పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో యూనివర్సల్ హెల్త్‌పాలసీ వైద్యసేవలు అందించేలా తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రూ.5 లక్షల వరకూ పరిమితి ఉండగా ప్రస్తుతం రూ.25 లక్షలకు వైద్యం పొందే అవకాశం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలో 5.67 లక్షల ఎన్టీయార్ వైద్యసేవ కార్డుదారులు లబ్ధి పొందనున్నారు. సమాజ ఆరోగ్య బీమాగా పేరొందిన ఈ పథకం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు భరోసాగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా 949 రకాల చికిత్సలు అందిస్తున్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ పథకం ద్వారా వైద్యసేవలు అందిస్తుంటారు. ఈ పథకం ద్వారా గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, పాంక్రియాస్, కిడ్నీ , న్యూరో, పిడియాట్రిక్, పుట్టుకతో వచ్చే వైకల్యాలు, గాలిన గాయాలు తదితర వ్యాధులకు చికిత్స అందిస్తుంటారు. ఈ పథకం ద్వారా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో చేరేవారు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా వైద్యం పొందవచ్చు.

పేదలకు ఖరీదైన వైద్యం

గతంలో రూ.5 లక్షలకు పైబడి వైద్య సేవలు అవసరమైన వారు ఈ పథకం ద్వారా వైద్యం చేయించుకోలేకపోయేవారు. ప్రస్తుతం యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా పరిమితి పెంచడంతో వైద్యఖర్చులకు సంబంధం లేకుండా వైద్యసేవలు అందనున్నాయి. ఈ నిర్ణయంతో పేద వర్గాలకు నాణ్యమైన ఖరీదైన వైద్యం అందనుంది.ఈ పథకంలో చికిత్స పొందడానికి వీలులేని వ్యాధులకు సీఎం సహాయనిధి ద్వారా పేదలకు వైద్య ఖర్చులు అందించే వెసులు బాటు కూడా ఉంది.

• పేదలకు వరం



పేద కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం వరంలాంటిది. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న వారికి ఈ పెంపు మరింత ఆనందాన్నిచ్చే అంశం.

పటాన్ రహీమా, తాడేపల్లిగూడెం

• మంచి నిర్ణయం



ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా వైద్య సహాయం పొందాలనుకునే వారికి ఈ పెంపు మంచి పరిణామం. మా బంధువులు ఇటీవల లిమిట్ లేక పోవడంతో బయట వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుత నిర్ణయంతో అలాంటి సమస్య ఉండదు.

డి.మార్తమ్మ, తాడేపల్లిగూడెం

• జిల్లాలో 27 ప్రైవేటు ఆసుపత్రుల్లో ..

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా కవర్ అయ్యే ఆసుపత్రులు 27 ఉండగా ఐదు డెంటల్ హాస్పటల్స్ ఉన్నాయి. వాటికి తోడు ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయి. ఈ ఆసుపత్రుల ద్వారా 5 లక్షల 67 వేల కార్డుదారులు ఈ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స చేయించుకునే అవకాశం ఉంది.

డాక్టర్ కీర్తి శ్రావణ్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్

దానగూడెం ఘటనలో ఏడుగురి అరెస్టు

నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కైకలూరులోని దానగూడెం ఘర్షణ ఘటనపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, టౌన్ సీఐ కృష్ణలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కైకలూరు టౌన్ పరిధిలోని కరకట్ట దగ్గర గతనెల 31వ తేదీ రాత్రి గణేష్ విగ్రహ ఊరేగింపు కాపుల వీధిలో ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి దానగూడెంనకు చెందిన ఇంటి సాగర్ తన ఇంటికి వెళ్తూ ఊరేగింపు దాటుతున్న సమయంలో ఒకసారిగా పడిపోయాడు. దానికి కారణం ఊరేగింపులోని కొందరు యువకులని తెలుసుకుని దానగూడేనికి చెందిన మహిళలు, యువకులు వచ్చి ఊరేగింపులో ఉన్న వారితో గొడవ పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు వెంటనే ఇరువర్గాల వారిని సర్దిచెప్పి పంపించి వేశారు. మరుసటి రోజున ఇరువర్గాల పెద్దలను, ఘర్షణకు కారణమైన వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఈనెల 5వ తేదీ రాత్రి దానగూడెంకు చెందిన పైయద్దు అజయ్ అతని స్నేహితులు మరో ఇద్దరు మోటారు సైకిల్‌పై కైకలూరు వెళ్తుండగా ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి గణేష్ ఊరేగింపులో ఉన్న కొంతమంది యువకులు



కైకలూరు చిన్నచెరువు గట్టు వద్ద పోలీస్ పికెట్

మోటారు సైకిల్‌కు దారి ఇవ్వకపోవడంతో దారి ఇవ్వమని అజయ్ కోరగా కొందరు యువకులు కులం పేరుతో దూషిస్తూ దాడి చేయగా ప్రాణ భయంతో వారు పారిపోయారన్నారు. విషయం తెలిపి దానగూడెంకు చెందిన కొంతమంది కాపుల బజారుకు చేరుకోగా ఇరువర్గాలు కర్రలతో, రాళ్లతో దాడులు చేసుకున్నారన్నారు. సమాచారం అందుకున్న కైకలూరు పోలీసులు వారిని వెంటనే చెదరగొట్టి గాయపడిన పైయ్యద్దు అజయ్, దినేశ్‌లను ఆసుపత్రికి తరలించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారన్నారు. ఆసుపత్రిలో బాధితుల నుంచి వాగ్మూలం నమోదు చేసుకున్నామన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు నిందితులపై హత్యాయత్నం, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. నిందితులైన తులసి శివకుమార్ అలియాస్ శివ (22), తోట కార్తికేయ అలియాస్ కార్తి (23), తులసి పూర్ణచంద్రరావు అలియాస్ పూర్ణ (46) పోతుల నాగమణికంఠ అలియాస్ బాలు (31), పిచ్చుకుల రాజేష్ (43), తోట సంజయ్ భార్గవ్ అలియాస్ బబ్బు (25), కటికన జయప్రకాష్ అలియాస్ జెపి (25)లను అరెస్టు చేశామన్నారు. మిగిలిన వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు.

దానగూడెం ఎవరూ రావద్దు : డీఎస్పీ

శాంతి భద్రతల దృష్ట్యా పోలీస్‌యాక్టు 30 (బీఎన్‌ఎస్ 163)యాక్టు జిల్లా వ్యాప్తంగా అమలులో ఉన్న దృష్ట్యా ఇతర ప్రాంతాల వారు దానగూడెం గ్రామానికి రాద్దని డీఎస్పీ సూచించారు. కొంతమంది పరామర్శల పేరుతో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు సోషల్ మీడియాలో రకరకాల అవగాహన లేని కథనాలతో పోస్టులు చేస్తున్నారని శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దానగూడెంనకు ఇతర ప్రాంతాల నాయకులు ఎవరైనా వెళ్లాలనుకుంటే ముందస్తుగా పోలీసు అనుమతి తీసుకోవాలని సూచించారు.

కరకట్టపై పోలీస్ నిఘా

కైకలూరు,సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): కైకలూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఆదివారం బందోబస్తు నిర్వహించారు. ఎక్కడికక్కడే పోలీసులు పహారా కాస్తూ కైకలూరు కరకట్ట ప్రాంతానికి వెళ్లేవారి వివరాలను ఆరా తీశారు. బయట గ్రామాల ప్రజలు అక్కడకు వెళ్లేందుకు అనుమతులు నిరాకరించారు.కరకట్ట, దానగూడెం గ్రామానికి చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైన అనుమానాస్పదమైన వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు. కైకలూరు బైపాస్ రోడ్డు చిన్నచెరువుగట్టు వద్ద, కరకట్ట ఆంజనేయ స్వామి గుడివద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామరెడ్డి

నాణ్యమైన ఆహారాన్ని అందించండి

టేస్టింగ్ సాల్ట్, రంగులు ఉపయోగించకండి

ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామరెడ్డి

భీమవరం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రంగులు, టేస్టింగ్ సాల్ట్ ఉపయోగించకూడదని, వంటనూనెలను రెండుసార్లు కంటే మరిగించకూడదని,నాణ్యమైన పదార్థాలను విక్రయించాలని ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామరెడ్డి అన్నారు. ఆదివారం స్పైస్ మ్యాజిక్ కాన్ఫరెన్స్ హాల్‌లో భీమవరం హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాశీ రాజు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హోటల్ నిర్వాహకులు తప్పనిసరిగా ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. హోటల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అభిరుచి కాశీ రాజు మాట్లాడుతూ నాణ్యతలో రాజీ పడకుండా అధికారుల సూచనలు పాటిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. బిర్లా రాజా, భాస్కరరావు, లక్ష్మీనారాయణబాబు, నాగరాజు, చంద్రికమూర్తి, అభిరుచి వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి

బిట్స్ లా స్కూల్ అడ్మిషన్స్

ముంబాయిలోని బిట్స్ లా స్కూల్‌లో 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ(ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్)లో అడ్మిషన్స్ కోసం నోటిఫికేషన్ వెలువడింది. ఈ కోర్సులకు బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా ఆమోదం ఉందని సంస్థ వెబ్‌సైట్ పేర్కొంది. టెక్నాలజీ అండ్ మీడియా లా, కార్పొరేట్ అండ్ ఫైనాన్షియల్ లా, ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ లా, ఆల్టర్నేట్ డిస్పూట్ రిజల్యూషన్, అండ్ మీడియేషన్ అనే స్పెషలైజేషన్లు ఇందులో ఉన్నాయి.

బీఏ ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్) **120 సీట్లు ,**
బీబీఏ ఎల్ఎల్‌బి(ఆనర్స్) 60 సీట్లు
మొత్తం **180**



అర్హత: కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. అలాగే క్లాట్/ఏఐఎల్ఈటీ/స్లాట్/ఎల్‌నాట్/బిట్స్ లాట్ లో స్కోరు సాధించి ఉండాలి. ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఎచీవ్‌మెంట్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
ఎంట్రెన్స్: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. 70 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు 60 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. నెగెటివ్ మార్కింగ్ లేదు. రీజనింగ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
ఫీజు: కాలేజీ ఫీజు రూ.7,37,100/-, హాస్టల్ ఫీజు 3,27,600/-.(కాలేజీలో స్కాలర్‌షిప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.
చివరి తేదీ: 2026 జనవరి 6
క్లాసులు ప్రారంభం: 2026 జూలై
వెబ్‌సైట్: www.bitslawschool.edu.in

గ్రామీణ బ్యాంకుల్లో పోస్టులకు
ఐబీపీఎస్ నోటిఫికేషన్

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో క్లర్క్, ఆఫీసర్ల నియామకాల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 13,217 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇందులో తెలంగాణలో 798 పోస్టులు(450 ఆఫీస్ అసిస్టెంట్లు, 348 ఆఫీసర్లు), ఏపీలో 152(150 ఆఫీస్ అసిస్టెంట్, 2 ఆఫీసర్) పోస్టులు ఉన్నాయి.



పేరు	పోస్టులు
ఆఫీస్ అసిస్టెంట్స్	7972
ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్)	3907
స్కేల్ 2, స్కేల్ 3	1338

(ఈ స్కేల్ 2, స్కేల్ 3లో అగ్రికల్చర్ ఆఫీసర్, లా ఆఫీసర్, సీఏ, ఐటీ, జనర్ బ్యాంకింగ్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్, ట్రెజరీ మేనేజర్ తదితరాలు ఉన్నాయి).

వయస్సు: ఆఫీస్ అసిస్టెంట్‌కు 18-25 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 18-30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2కు 21-32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-1కు 21-40 ఏళ్లు ఉండాలి. సరైన కటాఫ్ డేట్స్ కోసం నోటిఫికేషన్ చూడవచ్చు.
ఎంపిక విధానం: ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ(కొన్ని పోస్టులకు ఇంటర్వ్యూ లేదు) ద్వారా ఎంపిక జరుగుతుంది. మల్టీ పర్పస్ అసిస్టెంట్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీపై 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఆఫీసర్ ప్రిలిమినరీ పరీక్షలో రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 80 మార్కులకు, 80 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 45 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్‌లో రీజనింగ్, కంప్యూటర్ నాలెడ్జ్, జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ తదితరాలపై ప్రశ్నలు ఉంటాయి.
పరీక్ష: 2025 నవంబర్/డిసెంబర్‌లో ప్రిలిమ్స్, 2025 డిసెంబర్ /2006 జనవరిలో మెయిన్స్ ఉంటుంది.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 29 **వెబ్‌సైట్:** https://ibps.in/

ఇండియన్ నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

మొత్తం ఖాళీలు 260

ఇండియన్ నేషనల్ అకాడమీ(ఐఎన్ఏ) నుంచి షార్ట్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువడింది. 2026 జూన్‌లో ప్రారంభమయ్యే ఈ కోర్సుకు అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
కోర్సు వివరాలు: షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్, 2025

బ్రాంచి వివరాలు:
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్(జీఎస్(ఎక్స్)/హైడ్రో కేడర్): 57
- పైలెట్: 24
- నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్: 20
- ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: 20
- లాజిస్టిక్స్: 10
- నేవల్ ఆర్నమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్: 20 పోస్టులు
- లా: 2
- ఎడ్యుకేషన్: 15
- ఇంజనీరింగ్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 36
- ఎలక్ట్రికల్ బ్రాంచ్(జనరల్ సర్వీస్) 40
- నేవల్ కన్‌స్ట్రక్టర్: 16

అర్హత: పోస్టును బట్టి సంబంధిత బ్రాంచీలో బీఎస్సీ, బీకాం, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా,పీజీ, పీజీ డిప్లొమా ఉండాలి. అభ్యర్థులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న శారీరక, వైద్య ప్రమాణాలు ఉండాలి.
వయస్సు: 2001 జూలై 2 నుంచి 2007 జనవరి 1 లోపు జన్మించి ఉండాలి.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 8.
వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

బీహెచ్ఈఎల్‌లో గ్రేడ్-4 ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు 515

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్)లోని హైదరాబాద్, విశాఖపట్నం సహా దేశ వ్యాప్తంగా ఉన్న 11 యూనిట్లలోని 515 ఆర్టిసన్ గ్రేడ్-4 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. (ఫిట్టర్ 176, వెల్డర్ 97, టర్నర్ 51, మెషినిస్ట్ 104, ఎలక్ట్రీషియన్ 65, ఎలక్ట్రానిక్ మెకానిక్ 18, ఫౌండ్రీమన్ 4)
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 12
అర్హత: పదో తరగతితోపాటు ఐటీఐ/ సమాన అర్హత ఉండాలి.
వయస్సు: 2025 జూన్ 1 నాటికి జనరల్/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 సంవత్సరాలు, ఓబీసీ వారికి 30, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 32 మించి ఉండకూడదు. సంబంధిత ట్రేడ్ అనుభవం ఉంటే వయోపరిమితిలో ఏడు సంవత్సరాల సడలింపు ఉంటుంది.
వెబ్‌సైట్: https://careers.bhel.in

ఎల్ఐసీలో అప్రెంటిస్‌షిప్

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్‌లో తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అప్రెంటిస్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
వెబ్‌సైట్: www.lichousing.com/careers

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2025

ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రారంభించింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ స్కీమ్ ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. దేశ వ్యాప్తంగా లక్ష మందికి ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కి 4087 స్కాలర్‌షిప్‌లను కేటాయించారు ప్రభుత్వ/ స్థానిక సంస్థలు/ మున్సిపల్/ ఎయిడెడ్ పాఠశాలలు/ మోడల్ పాఠశాలలు చదివే విద్యార్థులు అర్హత పరీక్ష రాయవచ్చు. రెసిడెన్షియల్ విద్యార్థులు అర్హులు కారు.
ఆర్థిక ప్రోత్సాహం: ఈ పథకానికి ఎంపికైన వారికి నెలకు వేయి చొప్పున ఏడాదికి మొత్తం 12,000/- రూపాయలు అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి చేసే వరకు నాలుగు సంవత్సరాలు ఈ ఉపకార వేతనం లభిస్తుంది.
అర్హత: ఏడో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి. తుది ఎంపిక సమయానికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం 3,50,000/- రూపాయలకు మించి ఉండకూడదు.
దరఖాస్తు: రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ వైబ్‌సైట్ ద్వారా ఆయా స్కూల్స్ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలి. తర్వాత దరఖాస్తుల ప్రింటౌట్, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపాలి. ఓసీ/బీసీ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.100/-, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు రూ.50/- ఉంటుంది.
చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 30 **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Schaeffler India Social Innovator Fellowship Program 2025

Description: Schaeffler India invites applications from individuals aged 18 to 35 who are building innovative, sustainable solutions with the potential to create meaningful social impact across India.
Eligibility: Applicants must be Indian residents aged 18 to 35 years as of 1st July 2025. The fellowship is open to early-stage start-ups or NGOs with a working prototype ready for implementation.
Prizes & Rewards: Exclusive mentorship at IIMA Ventures, IIM Ahmedabad, paired with an inspiring fellowship grant and access to extensive networking opportunities.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SIA4

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative of Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) disciplines.
Eligibility: The applicants must be female students from India.
- They should have successfully completed their Class 12 examinations.
- Eligible students include those enrolled in the first year of undergraduate STEM courses at recognised NIRF-accredited institutions. Additionally, second-year B.Arch students and those pursuing five-year Integrated or Dual Degree programs are also welcome to apply.
- Female students intending to pursue engineering and medical courses in government colleges not listed in the NIRF rankings are also eligible to apply.
- The annual family income of the applicants must not exceed 8,00,000.

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1,00,000 per annum, covering actual expenses, for the duration of the course.
Last Date to Apply: 15-09-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ISTS3

buddy4study.com

చిత్రజ్యోతి
SINCE 1965

ఉత్కంఠకు లోనయ్యా

- ఇమ్రాన్ హష్మీ



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ' అనే చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఈనెల 25న ప్రపంచ వ్యాప్తంగా తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదల కానుంది. కాగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఈ చిత్రం ద్వారా తొలిసారిగా తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. ఇందులో ఆయన ప్రతినాయకుడి పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సినిమా కోసం నన్ను సంప్రదించినపుడు ఉత్కంఠకు లోనయ్యా. ఇది నాకు తెలుగులో తొలి సినిమా. సూపర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో కలసి తెరను పంచుకోవడం కంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. పవన్ కల్యాణ్, చిత్ర దర్శకుడు సుజిత్‌తో కలసి పనిచేయడం అద్భుతమైన అనుభవం' అని చెప్పారు.

నయన్‌తో డ్యూయెట్





చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలు పెంచాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. నేటి నుంచి హైదరాబాద్‌లో చిరంజీవి, నయనతారపై ఓ పాటను చిత్రీకరించనున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ గీతానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, డ్యాన్స్ మాస్టర్ విజయ్ పోలంకి నృత్య రీతులు సమకూర్చుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఊహకందని మలుపులతో...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటివరకూ ప్రేక్షకులు చాలా హారర్ సినిమాలు చూసి ఉంటారు. కానీ 'కిష్కింధపురి' చాలా ప్రత్యేకం. థ్రిల్లింగ్ అంశాలతో ఊహకందని మలుపులతో సాగుతుంది. విజువల్ ఎఫెక్ట్స్ అద్భుతంగా వచ్చాయి' అని అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి హారర్ చిత్రాలంటే చాలా ఇష్టం. 'కిష్కింధపురి' ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. హారర్ ఎలిమెంట్స్ అబ్బురపరుస్తాయి' అని చెప్పారు.



బిగ్‌బాస్ 9 ప్రారంభం




బుల్లితెర ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న టెలివిజన్ రియాలిటీ షో 'బిగ్‌బాస్ సీజన్ 9' ఆదివారం ప్రారంభమైంది. ఈ సీజన్ ఊహకందని మార్పులు, ఊహించని మలుపులతో ఉండబోతోందని వ్యాఖ్యాత నాగార్జున అన్నారు. ఈసారి సెలబ్రిటీలతో పాటు సామాన్యులకూ సమాన అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన కంటెస్టెంట్లను ప్రేక్షకులకు పరిచయం చేశారు.

ఈ సీజన్ కంటెస్టెంట్లు

1. కన్నడ నటి తనూజ పుట్టస్వామి	సెలబ్రిటీ
2. హీరోయిన్ ఫ్లోరా షైనీ(ఆశా షైనీ)	సెలబ్రిటీ
3. కల్యాణ్ పడాల	సామాన్యుడు
4. 'జబర్దస్త్' ఇమ్మాన్యుయేల్	సెలబ్రిటీ
5. కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ	సెలబ్రిటీ
6. హరిత హరీశ్(మాస్క్ మెన్)	సామాన్యుడు
7. నటుడు భరణి	సెలబ్రిటీ
8. నటి, యాంకర్ రీతూ చౌదరి	సెలబ్రిటీ
9. డిమాన్ పవన్	సామాన్యుడు
10. నటి సంజన గల్రానీ	సెలబ్రిటీ
11. గాయకుడు రాము రాథోడ్	సెలబ్రిటీ
12. శ్రీజ దమ్ము	సామాన్యురాలు
13. హాస్య నటుడు సుమన్ శెట్టి	సెలబ్రిటీ
14. ప్రియ శెట్టి	ఆడియెన్స్ పోల్
15. మర్యాద మనీశ్	ప్రత్యేక ఎంపిక

గాయకుడిగా ప్రకాశ్ రాజ్



ఇప్పటి వరకు వెండి తెరపై తన విలక్షణ నటనతో మెప్పించిన ప్రకాశ్ రాజ్ ఇప్పుడు గాయకుడిగా కూడా అలరించబోతున్నారు. ఇందుకోసం ఆయన తన బృందంతో కలసి శ్రీలంక చేరుకున్నారు. ఇక్కడి క్యాండీ నగరంలో ఈనెల 8, 9 తేదీల్లో నిర్వహిస్తోన్న 'నియేలిని గ్లోబల్ సమ్మిట్'లో ప్రకాశ్ రాజ్ పాల్గొంటున్నారు. ఈ సదస్సుకు 102 దేశాలకు చెందిన పౌర సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, శాస్త్రవేత్తలు సుమారు 500 మంది హాజరవుతున్నారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఆహారభద్రత, వ్యవసాయ రంగంలో సంక్షోభంపై ప్రముఖంగా చర్చించనున్నారు. ఈ సదస్సుకు సంఘీభావంగా 'సాంగ్స్ ఆఫ్ రెసిలియన్స్' పేరుతో నిర్వహించనున్న కచేరీలో ప్రకాశ్ రాజ్ తన బృందంతో కలసి స్వయంగా కవితాగానం చేయనున్నారు.

అద్భుతమైన ప్రయాణమిది


రాశీ ఖన్నా

'కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరచిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలసిన ప్రయాణమిది' అని అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా, రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నీరజా కోన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తెలుసు కదా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా దీపావళి కానుకగా అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న రాశీ ఖన్నా ఈ చిత్రానికి సంబంధించిన అనుభవాలు పంచుకుంటూ 'ఈ ప్రయాణంలో నాతో నడిచిన చిత్రబృందానికి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగుపెట్టే రోజు కోసం ఎదురుచూస్తున్నాను. మీకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందీ చిత్రం' అని అన్నారు.

మిరాయ్ ప్రేక్షకులను మెప్పిస్తుంది


ధ్రువ సర్జా

తేజ సజ్జా కథానాయకుడిగా నటించిన సూపర్‌హీరో చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. మంచు మనోజ్ ప్రతినాయక పాత్రను పోషించారు. ఈ నెల 12న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బెంగళూరులో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన కన్నడ హీరో ధ్రువ సర్జా మాట్లాడుతూ 'ఒక పండగ లాంటి వాతావరణంలో 'మిరాయ్' సినిమా విడుదలవుతోంది. అద్భుతమైన నటీనటులు, టెక్నీషియన్లు ఈ సినిమా కోసం పనిచేశారు. విశ్వప్రసాద్ భారీస్థాయిలో నిర్మించారు. ప్రచార చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. తేజ సజ్జా మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు అందరూ కలసి చూసేలా 'మిరాయ్' చిత్రం ఉంటుంది. యాక్షన్‌కి థ్రిల్‌ని మేళవించి తీసిన ఓ మంచి చిత్రమిది. పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని చెప్పారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'ధ్రువ సర్జాతో ఓ చిత్రం చేయబోతున్నాం. 'మిరాయ్' చిత్రాన్ని మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించాం' అని తెలిపారు.


భీమవరం మావుళ్లమ్మ ఆలయ మహాద్వారం మూసివేసిన ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ, తదితరులు


పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయ మహాద్వారం మూసివేత


జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వరస్వామి ఆలయం మూసివేత

గ్రహణం ఎఫెక్ట్

ఆలయాల మూసివేత


ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో వెలవెలబోయిన క్యూలైన్లు

సంపూర్ణ చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఆలయాలు ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. ఆదివారం రాత్రి 9.50 గంటల నుంచి రాహు గ్రస్థ చంద్ర గ్రహణం ప్రారంభం కావడంతో మధ్యాహ్నం ఆలయాల్లో మహానివేదనలు పూర్తిచేసి ఆలయాలను ఈవోల ఆధ్వర్యంలో మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసిన అనంతరం భక్తులు దర్శనాలు ఉంటాయి. ఏలూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ బంగారు ద్వారాలు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారా యణమూర్తి సమక్షంలో అర్చకులు తాళాలు వేసి దర్శనాన్ని నిలుపుదల చేశారు. తిరిగి సోమవారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి దర్శనం కల్పిస్తామని

నేటి ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాల్లో దర్శనాలు

ఈవో తెలిపారు. కొండపైన శివదేవుని ఆలయం మూసివేశారు. చంద్రగ్రహణం ప్రభావంతో అరకొరగా భక్తులు ఆలయానికి వచ్చారు. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామి ఈవో ఆర్వీ చందన ఆధ్వర్యంలో, జంగారెడ్డిగూడెం పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఈవో కలగర శ్రీనివాస్ ఆధ్వర్యంలో, పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవాలయాలు మూసివేశారు.

● పశ్చిమ గోదావరి జిల్లాలో ఆలాయ అధికారాలు దగ్గరుండి ఆలయాలకు తాళాల వేయించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన భీమవరం మావుళ్లమ్మ ఆలయం, సోమేశ్వర స్వామి, భీమేశ్వరస్వామి ఆలయాలు, పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి, అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి నరసాపురంలోని ఎంబర్‌మన్నార్ దేవాలయం, ఆచంటలోని నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలు మూసివేశారు.

- ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం/పెదపాడు/ భీమవరంటౌన్/పాలకొల్లుఅర్బన్/ద్వారకాతిరుమల



ఆరోగ్య సంరక్షణకు ఫిజియోథెరపీ వరం

ఫిజియోథెరపీ.. ఏవిధమైన సైడ్ ఎఫెక్ట్ లేని ఒక శారీరక చికిత్స. ఆరోగ్యసంరక్షణలో ఇది ఓ విభాగం. గాయం, అనారోగ్యం, లేదా శస్త్రచికిత్స తర్వాత కదలికలను పునరుద్ధరించడం, నొప్పిని తగ్గించడం వంటి పనితీరు ఫిజియోథెరపీ వల్ల మెరుగుపడుతుంది. నేడు ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా వైద్యవిధానంలో ఫిజియోథెరపిస్టుల ప్రాముఖ్య తను తెలుపుతూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల/తణుకు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనిషి శారీరక భౌతిక అవయవాలను ఒక క్రమపద్ధతిలో కదిలించేలా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపర్చడంలో ఫిజియోథెరపిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. దీనిపై అవగాహన పెంచడానికి ప్రతీ ఏటా సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. ప్రపంచ ఫిజియోథెరపీ కౌన్సిల్‌ను 1951లో సెప్టెంబరు 8న ఏర్పాటు చేశారు. ఈ రోజునే ప్రతీ ఏడాది ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా వైద్యులు నిర్వహిస్తున్నారు. ఫిజియోథెరపీపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 1996లో ప్రపంచ శారీరక చికిత్స సమాఖ్య ఈ దినోత్సవాన్ని పారంభించింది.

ఫిజియోథెరపీ అంటే..

ప్రస్తుతం ఫిజియోథెరపీకి డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. పుట్టుకలో వచ్చే లోపాలు, ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా శారీరకంగా, మానసికంగా కుంగే వారికి ఫిజియోథెరపీ ఒక వరం. సర్జరీ ఏదైనా సక్సెస్‌లో 50శాతం ఫిజియోథెరపీపై ఆధారపడాల్సిందే. అనారోగ్యం, గాయం, శస్త్రచికిత్స తర్వాత శారీరక విధులను పునరుద్ధరించేది ఈ ఫిజియోథెరపీ మాత్రమే. ఎలాంటి మందుల ప్రమేయం లేకుండా తల మొదలు అరికాలు వరకు నొప్పిని తగ్గించడం, వ్యాయామంతో కండరాలు. కీళ్లు, నరాల సామర్థ్యాన్ని ఈ ఫిజియోథెరపీ ద్వారా పెంచుకోవచ్చు.

చికిత్స విధానం ఇలా..

ఫిజియోథెరపిస్టులు తమ చికిత్సలో భాగంగా వ్యాయామచికిత్స, మాన్యువల్ థెరపీ, ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్, మసాజ్ వంటి పద్ధతులను ఉపయోగిస్తారు. శరీరంలో ఏదైనా ఎముక, విరిగినా.. కండరం పట్టేసినా శస్త్రచికిత్స అనంతరం గాయమైన కండరం, ఎముక సాధారణ స్థితికి చేరుకునేందుకు వైద్యులు ఫిజియోథెరపీని రిఫర్ చేస్తారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పక్షవాత రోగులకు దీన్ని దశలవారీగా వ్యాధి తీవ్రతకు అనుగుణంగా చికిత్సను అందిస్తామని ఫిజియోథెరపిస్టులు చెబుతున్నారు. హెల్తీ లైఫ్‌ను, ఫిట్‌నెస్‌ను ఆస్వాదించాలంటే ఫిజియోథెరపీ ఏకైక మార్గమని చెబుతున్నారు.

ఫిజియోథెరపీ డే-2025 థీమ్..

ఆరోగ్యకరమైన వృద్ధాప్యం. ఈ థీమ్ వృద్ధులలో బలహీనత, తూలి పడిపోవడాన్ని నివారించడంలో ఫిజియోథెరపీ, శారీరక శ్రమల పాత్రను వెల్లడిస్తుంది. ఫిజియోథెరపిస్టులు పోషించే కీలక పాత్రను ఈ థీమ్ బలపరుస్తుంది.

సైడ్ ఎఫెక్ట్ లేని వైద్యం



ఫిజియోథెరపీతో స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో, తదితర ఇబ్బందుల నుంచి ఉపశయనం పొందొచ్చు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్ల వాడకం వల్ల భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారు. ఇటువంటి వారికి మందుల వాడకం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్ బాధలేకుండా ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగకరం.

- డాక్టర్ భవ్యచంద్, విర్డ్ ఆసుపత్రి ప్రధాన వైద్యుడు, ద్వారకాతిరుమల.

ఈ వృత్తిలో సహనం, ఓర్పు అవసరం




శారీరక సమస్యలతో ఫిజియోథెరపీ వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల ఎంతో సహనం, ఓర్పు కలిగి వుండాలి. ఈ వృత్తి మానవ సంబంధాల శక్తిని నేర్పుతుంది. ప్రతీ కదలిక, తగ్గించబడిన నొప్పి వెనక రోగికి మాత్రమే కాకుండా వైద్యులకు కూడా అవసరంగా గుర్తించాలి.

-డాక్టర్ గెల్లా కావ్య, వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రి, అలంపురం.


అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం మూసివేత దృశ్యం


పెంటపాడులో మూసివేసిన బాల వేంకటేశ్వరస్వామి ఆలయం


జుత్తిగ సోమేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై అరుదైన ఆకృతిలో సూర్యబింబం

జుత్తిగ దేవాలయంపై సూర్యబింబం

పెనుమంట్ర : జుత్తిగ గ్రామంలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయ గాలి గోపురంపై అరుదైన ఆకృతిలో సూర్య బింబం భక్తులకు దర్శనమిచ్చింది. పౌర్ణమి రోజు సోమేశ్వర స్వామి గాలిగోపురంపై మధ్యాహ్నం సమయంలో కారు మబ్బులు కమ్ముకున్న ఆకాశం మధ్యలో శివుడు మూడో కన్ను తెరిచినట్లుగా ప్రతిబింబం కనిపించడంతో భక్తులు తిలకించారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు వినికిడి అంకెల టాంపరింగ్ !

» ధ్రువపత్రాల్లో దిద్దివేతలపై జిల్లా విద్యాశాఖ ఫిర్యాదు

» విచారణ చేపట్టిన గుంటూరు జీజీహెచ్ వైద్యనిపుణుల కమిటీ

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో దివ్యాంగుల అంగవైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ జారీచేసిన సర్టిఫికెట్లను టాంపరింగ్ చేసినట్టు ధ్రువపడింది. ఈ మేరకు తమ దృష్టికివచ్చిన పీహెచ్ ధ్రువపత్రాలపై సందేహం వ్యక్తంచేస్తూ కొద్దిరోజులక్రితం పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులదృష్టికి జిల్లా విద్యాశాఖ తీసుకెళ్లడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై గుంటూరు జీజీహెచ్‌లో విచారణ జరుగుతున్నట్టు సమాచారం. సర్టిఫికెట్ల ట్యాంపరింగ్ ఎక్కడ జరిగింది, ధ్రువపత్రాల్లో వైకల్యశాతాన్ని మార్చివేసిన ఆనవాళ్లు, బాధ్యులె వరు, తదితర అంశాలపై విచారణ కమిటీ సోమవారం నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

డీఎస్సీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైనవారిలో ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అభ్యర్థులు వైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ మెడికల్ బోర్డు జారీచేసే ధ్రువపత్రాలను తీసుకుని సమర్పించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆరుగురు దివ్యాంగ (వినికిడి లోపం) అభ్యర్థులను గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు ఇటీవల జిల్లా విద్యాశాఖ పంపగా, అక్కడ జారీ చేసిన సర్టిఫికెట్లలో కొన్నింటిపై వైకల్యశాతాన్ని నిర్ధారించే అంకెల్లో దిద్దివేతలు/మార్పులు చేర్పులు చోటు చేసుకున్నట్టు గమనించారు. ఇదే విషయాన్ని కొద్దిరోజుల వ్యవధిలోనే విద్యాశాఖ ఉన్నతాధికారులు అన్నిజిల్లాల విద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో చెప్పినట్టు తెలిసింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు జారీ చేసిన వినికిడిలోపం అభ్యర్థుల ధ్రువపత్రాలను ఏలూరు జీజీహెచ్ మెడికల్ బోర్డుతో రీవెరిఫికేషన్/రీఅసెస్‌మెంట్ చేయించాలని ఆదేశించారు. మొత్తం ముగ్గురు వైద్య నిపుణులతో కూడిన మెడికల్ బోర్డు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంబంధిత తొలుత అభ్యర్థులకు ఆడియోమెట్రీ టెస్టులు చేసి, వారికి గుంటూరు జీజీహెచ్ మెడికల్‌బోర్డు జారీచేసిన వైకల్యశాతాన్ని తిరస్కరించింది. మొత్తం నలుగురు అభ్యర్థులకు జారీచేసిన ధ్రువపత్రాలపై జరిపిన రీవెరిఫికేషన్/రీఅసెస్‌మెంట్‌లో ఇద్దరికి ఆడియోమెట్రీ టెస్టుల్లో సంబంధించిన వినికిడిలోపం(హెచ్‌ఐ) నిర్ణీత 50శాతం లేనందున తొలుత ఇచ్చిన సర్టిఫికెట్లను తిరస్కరించినట్టు సమాచారం. మరో ఇద్దరు అభ్యర్థులకు జారీఅయిన సర్టిఫికెట్లలో పేర్కొన్న ప్రకారమే వైకల్యశాతం ఉన్నప్పటికీ ధ్రువపత్రాల్లో ఏమైనా టాంపరింగ్ జరిగిందా, లేదా అనే విషయాలు బయటకు తెలియడంలేదు. కాగా ఆర్థో(శారీరక అంగవైకల్యం) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక అభ్యర్థి తనకు అవగాహన లేకపోవడం వల్లే సంబంధిత కోటాలో దరఖాస్తు చేశానని, ఈడబ్ల్యూఎస్ కోటాలో తనకు ఉద్యోగంవచ్చే అవకాశంఉన్నందున ఆర్థో కోటానుంచి తనను తప్పించాలని లిఖితపూర్వకంగా జిల్లా విద్యాశాఖను అభ్యర్థించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక దృష్టిలోపం(వీహెచ్) కోటాలో డీఎస్సీకి ఎంపికైన ఒక మహిళాఅభ్యర్థికి ఏలూరు మెడికల్ బోర్డు జారీచేసిన ధ్రువపత్రంలో పేర్కొన్న వైకల్యశాతంపై రీఅసెస్‌మెంట్ కోసం ఆశ్రం ఆసుపత్రికి శనివారం పంపగా, పునఃపరిశీలన నివేదికను సీల్డ్‌కవర్‌లో పెట్టిఇచ్చినట్టు తెలిసింది.

బాధ్యులెవరు..?

వినికిడి లోపంవున్న అభ్యర్థులకు జారీచేసిన సర్టిఫికెట్లపై గుంటూరు జీజీహెచ్ మెడికల్ బోర్డు ఒకరికి 26శాతం వైకల్యాన్ని నమోదుచేయగా దానిని 62శాతంగా దిద్దివేశారని, మరొకరికి 35శాతం ఉన్నట్టుగా నిర్ధారిస్తే ఆ అంకెను 65 శాతంగా టాంపరింగ్ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. తమకు అందిన సర్టిఫికెట్లను జిల్లావిద్యాశాఖ అధికారులు, కొందరు ఉద్యోగులు నిశితంగా గమనిస్తే అంకెల టాంపరింగ్ బయటపడింది. గుంటూరు, ఏలూరు జిల్లాల విద్యాశాఖల్లో పనిచేస్తున్నవారికే ఈ టాంపరింగ్ వ్యవహారంలో పాత్ర ఉండ వచ్చని ప్రచారం ఒకటి ఉంది. ఈ రెండు జిల్లాల డీఈవో కార్యాలయాల అధికారులకే బాధ్యతలను ఇచ్చినట్టు సమాచారం. అలాకాకుంటే జీజీహెచ్ స్థాయిలోనే అవకతవకలను తోసిపుచ్చలేమని మరో ప్రచారం ఉంది. ఏదైనా విచారణ కమిటీ నివేదిక, పోలీసు ఎంక్వయిరీల్లోనే అసలు విషయాలు బయటకు వస్తాయని చెబుతున్నారు. డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల నిశిత పరిశీలనను ఇప్పటికీ ఏలూరు డీఈవో కార్యాలయంలో పలుమార్లు కొనసాగిస్తుండడం గమనార్హం.

పడిపోయిన బెండ ధర



» పెరిగిన తెల్ల వంకాయలు » నిలకడగా మహారాష్ట్ర ఉల్లి ధరలు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : బెండకాయల ధరలు నేలనంటాయి. గతవారం కిలో రూ.50 ఉన్న బెండకాయలు ఈవారం రూ.20కు పడిపోయాయి. బెండ కాయలు కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడేపల్లిగూడెం మండలంలోని లింగారాయుడుగూడెం, దండగర్ర, జగ్గన్నపేట, వెంకట్రామ న్నగూడెం, కొయ్యలగూడెం, సిద్ధాంతం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో విస్తారంగా బెండ సాగుచేశారు. ఇక్కడ ఆశాజనకంగా తోటలు కాయలు కాయడంతో వాటిని విక్రయించే సమయానికి ధర పడిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే బెండ కాయలు త్వరగా పెరిగిపోతాయని రైతులు చెబుతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పుతో ఎండలు పెరిగాయి. ప్రతిరోజూ కోతకు బెండవచ్చేస్తుంది. ఇబ్బడి ముబ్బడిగా బెండ దిగుమతి కావడంతో వీటిని కొనుగోలు చేయడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు. దీంతో అయినకాడికి రైతులు అమ్ముకోవాల్సి వస్తుంది. రిటైల్ వ్యాపారులు సైతం కిలో రూ.20కు విక్రయిస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతోంది.

● తెల్లవంకాయ ధర మాత్రం అమాంతంగా పెరిగింది. నాణ్యతను బట్టి కిలో రూ.80 నుంచి 100 మధ్య విక్రయాలు జరుగుతున్నాయి. నల్లవంగ కిలో రూ.60కు అమ్మకాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సిద్ధాంతం వంటి లంకప్రాంతాల్లో సాగుచేసిన వంగసాగు దెబ్బతింది. మెట్టప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో తెల్లవంగకు డిమాండ్ పెరిగింది. మిగిలిన కూరగాయలు స్థిరంగానే ఉన్నాయి.

స్థిరంగా మహారాష్ట్ర ఉల్లి..

మహారాష్ట్ర ఉల్లి స్థిరంగానే ఉంది. రూ.100కు నాలుగు కిలోల వంతున ఉల్లిని విక్రయిస్తున్నారు. నాసిరకం ఐదు కిలోల వంతున వంద రూపాయలకు అమ్ముతున్నారు. మొత్తం మీద మహారాష్ట్ర నుంచి వచ్చే పాత ఉల్లి ధరలు స్థిరంగానే ఉన్నాయి.

క్రైం సమాచారం

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక గుర్తుతెలియని యువకుడు జారిపడి ముక్కలు ముక్కలై మరణించాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని దెందులూరు మండలం సీతంపేట గ్రామ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉన్నట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందింది. రైల్వే హెచ్‌సీ శ్రీనివాస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తించడానికి ముఖం లేదు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయస్సు ఉండవచ్చని అతడి సెల్‌ఫోన్ ముక్కలై ఉండడంతో దానిని బట్టి గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మృతదేహం శరీరభాగాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి..

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మర్రిపూడి లక్ష్మణరావు చర్చిలో ప్రార్థన చేస్తుండగా భార్యపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కుటుంబ పోషణ నిమిత్తం భార్య సంగీత విదేశాలకు వెళ్లి వచ్చారు. వచ్చినప్పటి నుంచి భార్యపై అనుమానాన్ని భర్త పెంచుకున్నాడు. ఆదివారం భార్యపై దాడిచేయడంతో స్థానికులంతా భయభ్రాంతులకు గురై అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. భార్య సంగీతను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె కంటి దగ్గర, చేతిపై కత్తి గాయాలయ్యాయి. ఏరియా ఆసుపత్రిలో వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాదం శ్రీను తెలిపారు.

మద్యం మత్తులో జారిపడిన వ్యక్తి మృతి

ముసునూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన రమణక్కపేటలో ఆదివారం చోటు చేసుకుంది. తోట మురళీకృష్ణ(37) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై నిత్యం తాగుతూనే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న అతడు ఆదివారం ఉదయం ఇంటిలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

ఒకే ఇంట.. రెండు రోడ్డు ప్రమాదాలు

» సోదరుడికి యాక్సిడెంట్ అయిందని వెళ్తుండగా తమ్ముడిని వెంటాడిన ప్రమాదం


రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు

పెదపాడు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోదరుడికి యాక్సిడెంట్ అయ్యిందనే విషయం తెలుసుకుని చూసేందుకు వెళ్తున్న తమ్ముడు కూడా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వేర్వేరుచోట్ల ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడడంతో ఆ కుటుంబం ఆందోళన వ్యక్తం చేస్తోంది. విజయవాడకు చెందిన షేక్ జానీకి ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు షేక్ నసీర్ విజయవాడలో ఫిట్‌నెస్ సెంటర్ నడుపుతున్నాడు. ఈనెల 4న తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకల నిమిత్తం కారులో రాజమండ్రి వెళ్లాడు. ఈలోగా విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న గాయపడ్డాడని తెలుసుకున్న తమ్ముడు నసీర్ వెంటనే రాజమండ్రి నంచి విజయవాడకు కారులో వస్తుండగా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద ముందు వెళుతున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. ఒక వైపు అన్న విజయవాడలో, మరోవైపు తమ్ముడు గుంటూరులో చికిత్స పొందుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు.


ఎరువుల దుకాణం తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వరావు, అధికారులు

రూ.2.75 లక్షల విలువైన ఎరువులు సీజ్

ఏలూరు,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా పలు ప్రాంతాల్లోని ఎరువుల దుకాణాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఆగిరిపల్లి మండలం గొల్లగూడెంలో హనుమాన్ ఏజన్సీస్, ఎండూరు శ్రీరామ చంద్రమూర్తి, కాళ్ల మండలం బొండాడలో స్వామి అయ్యప్ప ఫెర్టిలైజర్స్ ఫెస్టిసైడ్‌లను, హనుమాన్ ఏజన్సీస్‌లో మొత్తం 2లక్షల75వేల550 విలువ విలువైన 12.650 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి, వాటిని సీజ్ చేశారు. బిల్లుల లేకుండా 1లక్ష17వే810 విలువైన 3.850 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశామని విజిలెన్స్ డీఎస్పీ సింగలూరి వెంకటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో సీఐలు శివరామకృష్ణ, ఎస్ఐలు సీహెచ్ రంజిత్‌కుమార్, కె.నాగరాజు, కె.సీతారాములు పాల్గొన్నారు.

ఉండి మండలంలో '144 సెక్షన్'

» ఆటోతో పోలీసుల హెచ్చరికలు


ఉండిలో ఆటో ప్రచార దృశ్యం

ఉండి, సెప్టెంబరు7 (ఆంధ్ర జ్యోతి): ఉండి మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని పోలీసులు ఆటో ద్వారా ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉండి పోలీస్ స్టేషన్ నుంచి ఆటో ద్వారా ప్రచారం కార్యక్రమం చేపట్టామని తహసీల్దార్ నాగార్జున, ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. మండలంలోని చెరుకువాడ బ్రాందీషాపు వద్ద ఇటీవల ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం కారణంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు ఎక్కడా కూడా ఐదుగురికి మించి వ్యక్తులు గుమిగూడి ఉండరాదన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలంతా సహకారించాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

రోడ్డుపై బైఠాయించిన వారిపై కేసు నమోదు

బ్రాందీషాపు తొలగించాలని కోరుతూ చెరుకువాడ- అర్తమూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై శనివారం బైఠాయింపు జరిపి ట్రాఫిక్‌కు కారకులైన వారిపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. ఆదివారం పోలీసులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏలేటి యేసురాజు, మార్తమ్మలతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

10 నుంచి ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు

పెదవేగి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 19 ఏళ్ల విభాగం బాల, బాలికల జిల్లా క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె.జయరాజు తెలిపారు. ఆసక్తిగల 19 ఏళ్లలోపు క్రీడాకారులు ఆయా క్రీడలకు సంబంధించిన నిర్దేశించిన విద్యాలయంలో హాజరుకావాలని తెలిపారు. 10న పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు ఆర్చరీ, ఫెన్సింగ్, కరాటే, జూడో, షూటింగ్, బాక్సింగ్, రగ్బీ, బీచ్ వాలీబాల్, గట్కా, కురాష్, కలరాయపట్టు, మోడరన్ పెంటాథ్లిన్, తైక్వాండో, తంగాట పోటీలు జరుగుతాయన్నారు. 11న ఫుట్‌బాల్, సెపక్ తక్రా, సైక్లింగ్ రోడ్ అండ్ ట్రాక్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్, వాటర్ పోలో, కుస్తీ పోటీలు. అదేరోజున భీమవరం బ్రౌనింగ్ జూనియర్ కళాశాలలో నెట్‌బాల్, మాల్కమ్ పోటీలు. 12న ఏలూరు ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, స్కేటింగ్, సీఆర్ఆర్ కళాశాలలో టెన్నిస్, టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, ఏఎస్ఆర్ స్టేడియంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న పెదవేగి బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో అథ్లెటిక్స్, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 99493 66162 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉచిత సంచార వైద్య సేవలు

తణుకు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఉచిత వైద్య సేవలు అందించారు. ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్యలు తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి తొమ్మిది మందికి వైద్య సేవలందించారు. సభ్యులు రవిరెజనాల్డ్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి అర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

గణపవరం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని ఎంజీ కంటి ఆసుపత్రి ఆవరణలో భీమవరం జ్ఞానానంద కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ కంటివ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతుందని వీటిపై అవగాహన లోపం వలన బాధపడేవారి సంఖ్య పెరుగుతుందన్నారు 180మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు


శ్రీఅష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారికి తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆదివారం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అళ్వార్లకు అలంకార తిరుమంజనోత్సవం నిర్వహించిన అనంతరం స్వామి వారికి, అమ్మవారికి శాంతి కల్యాణంతో శ్రీవారి పవిత్రోత్సవాలు ముగిశాయి.

వశిష్ఠ గోదావరికి పంచ హారతులు



పెనుగొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతం వశిష్ఠ గోదావరి వద్ద ఆదివారం పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోదావరి మాతకు పంచ హారతులు అతి వైభవంగా నిర్వహించారు. నదీమతల్లులను ఆరాధించడం అనాధిగా వస్తున్న మన సంప్రదాయమని తెలిపారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

తణుకు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యూరియా సంక్షోభంపై ప్రభుత్వం దృష్టి సారించి రైతు సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకులోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఏర్పడి రైతులు ఆందోళన చెందుతున్నారని, మరోవైపు అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదన్నారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాత్రం ఆర్కే ట్యాక్స్‌లు వసూలు చేస్తూ రూ. 1,200 కోట్లు ఆర్జించారని ఆరోపించారు. ఆరిమిల్లి చేస్తున్న అవినీతిని చూసి సొంత పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారని ఆరోపించారు. తన వద్ద అన్ని ఆధారాలు వున్నాయని, అవసరమైన సమయంలో బయటపెడతానని చెప్పారు.

రేలంగి నరసింహారావుకు సన్మానం

భీమవరం టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు పరిశ్రమలో డైరెక్టర్ గా రేలంగి నరసింహారావుకు ప్రత్యేక గుర్తింపు ఉందని శత చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. భీమవరం విచ్చేసిన హాస్య చిత్రాల సినీ దర్శకులు రేలంగి నరసింహారావును మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. నిర్మాత తుమ్మలపల్లి మాట్లాడుతూ గురువు దాసరి నారాయణ వద్ద అనేక సినిమాలకు అసిస్టెంట్‌గా పని చేసిన తర్వాత రేలంగి నరసింహారావు తెలుగు, కన్నడ భాషల్లో అనేక సినిమాలలో నవ్వులు పూయించారని, 70 కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించారని అన్నారు. మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓ లేటి శ్రీనివాస్ గుప్తా, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ, జూలూరి రాజా మాట్లాడుతూ రేలంగి నరసింహారావు దర్శకత్వంలో రూపొందిన మొదటి సినిమా చంద మామ అని ఈ హాస్య భరిత సినిమా జనాన్ని విపరీతంగా ఆకట్టుకుందన్నారు.

అన్నసమారాధన

భీమవరం టౌన్,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నరసయ్య అగ్రహారం, నాలుగవ వార్డులోని అమ్మ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ సతీమణి వెంకటేశ్వరి దేవి ప్రారంభించారు. అనంతరం భూపతి రాజు వెంకటేశ్వరి దేవిని, రాష్ట్రకృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులును సత్కరించారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, అల్లూరి శివరామరాజు, అమ్మ ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు విన్నకోట వినాయక్, కొత్తపల్లి శ్రీనివాస్, గరగనాగు పాల్గొన్నారు.

తగ్గిన గోదావరి

ఆచంట, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. కొన్ని రోజులుగా తగ్గుతూ పెరుగుతూ ఉన్న గోదావరి ఆదివారం తగ్గుముఖం పట్టింది. నీట మునిగిన పుష్కరఘాట్‌లు బయట పడుతున్నాయి.

విస్సాకోడేరులో వరసిద్ధి వినాయక ఉత్సవాలు


విస్సాకోడేరులో గణపతి

పాలకోడేరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరు గ్రామంలోని గాంధీపేటలో కరోతి కోటేశ్వరరావు కుమార్తె కెల్లా విజయలక్ష్మి 29 సంవత్సరాలుగా విగ్రహ దాతగా ఉంటూ గ్రామంలో గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా విజయలక్ష్మి కుటుంబ సభ్యులు రూ. 1.20 లక్షలతో విగ్రహాన్ని అందించారు. అప్పటి నుంచి గ్రామంలోని యువ గణేష్ యూత్ సభ్యులు సూర్య గణపతిగా ఏర్పాటు చేసిన విగ్రహానికి భారీ స్థాయిలో పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నెల 14వ తేదీ ఆదివారం నిమజ్జనాన్ని నిర్వహించి 21వ తేదీన అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు.

గణనాథుల నిమజ్జనం



ఆకివీడు సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : గణనాథులు ఊరేగింపులు, నిమజ్జనాలు ఆ దివారం జరిగాయి. చంద్రగహణం కారణంగా సాయంత్రం ఆరు గంటలలోపు మండపాల నిర్వహకులు నిమజ్జనాలు చేసేశారు. స్థానిక సాలిపేట తదితర చోట్ల నిర్వాహకులు భారీ ఊరేగింపులతో నిమజ్జనాలు నిర్వహించారు.

40 కేజీల లడ్డూ ప్రసాదం రూ.1.10 లక్షలు


దొడ్డనపూడిలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్న చందు సింకేట్

కాళ్ల, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల వేడుకలు ముగింపు సందర్భంగా ఆదివారం గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపారు. దొడ్డనపూడి గ్రామంలోని మంచినీటి చెరువు గట్టు వద్ద గణపతి నవరాత్రులు సందర్భంగా ఏర్పాటు చేసిన 40 కేజీల లడ్డూ ప్రసాదాన్ని ఆదివారం సాయంత్రం వేలంపాట నిర్వహించారు. గ్రామానికి చెందిన చందు సిండికేట్ యువకులు రూ.1.10 లక్షలకు ప్రసాదాన్ని దక్కించుకున్నారు.

రూ.72వేలు పలికిన బాలగణపతి లడ్డూ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వ వార్డులో బాల గణపతి ఆలయం వద్ద వినాయక చవితి లడ్డూ వేలం పాట నిర్వహించారు. స్వామివారి లడ్డూను పాడుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. చివరికి 28కేజీల లడ్డూను అలవల మనోహర్ గుప్త, వంశీకృష్ణ రూ.72వేలకు దక్కించుకున్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా?

- రోగులతో మాట్లాడిన కలెక్టర్
- భీమవరం ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ


ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఆదివారం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను సందర్శించి, రోగులతో స్వయంగా మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు ఎలా అందిస్తున్నారు, మీ పట్ల మర్యాదగా వ్యవహరిస్తున్నారా, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా, రక్త పరీక్షలు ఇక్కడే చేస్తున్నారా అని పలు ప్రశ్నలు వేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులను అభినందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు వైద్యానికి వస్తారని, వారిని మర్యాదతో పలకరించడంతోపాటు మంచి సేవలు అందించాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలలో మీ అందరి కృషి వల్ల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్నామని, ఇదే స్ఫూర్తిని ఇక ముందు కూడా కొనసాగించాలని అన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్ గీతానంద్, ఆర్ఎంవో డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్, డాక్టర్ సుబ్బలక్ష్మి, డాక్టర్ పద్మ ఉన్నారు.




విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి... చెక్కులు అందిస్తున్న మంత్రి రామానాయుడు.. ఇలపర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

రైతుల పట్ల వైసీపీ మొసలి కన్నీరు

తణుకు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం మాట్లాడే కనీస అర్హత కారుమూరికి గాని జగన్‌కు గాని ఏమాత్రం లేదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలో పౌరసరఫరాల మంత్రిగా ఉన్నా కనీసం రైతుల సమస్యలు గురించి పట్టించుకోని కారుమూరి ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో రైతులు పండించిన పంట అమ్ముకునేందుకు కూడా రైతులకు స్వేచ్ఛలేకుండా చేసిన విషయాన్ని రైతులు ఇప్పటికి గుర్తుపెట్టుకున్నారని అన్నారు. వైసీపీ హయాంలో ధాన్యం అమ్మిన డబ్బులు ఆరు నెలలు అయినా కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతులు సమస్యలు గురించి చెబుతుంటే ఆ రైతులను దుర్భాషలాడిన సంఘటనలు ఇప్పటికే రైతుల మదిలో మెదులుతున్నాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. లేని యూరియా కొరత కోసం కారుమూరి దుష్ప్రచారం చేస్తున్నారని, యూరియా కొరత ఎక్కడుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ రైతు పోరుబాటు దగాకోరుబాట అని వ్యాఖ్యానించారు. ఏడాది కాలంలో రూ.1200కోట్లు అవినీతి జరిగిందని చెబుతున్న కారుమూరి ఇందులో కనీసం 12రూపాయలు అవినీతి జరిగితే దమ్ముంటే నిరూపించాలని ఆరిమిల్లి సవాల్ చేశారు.

వసతి గృహాల్లో సదుపాయాల కల్పనకు కృషి

నియోజకవర్గంలోని వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం ఇరగవరం కాలనీలో ఎస్సీ బాలికల వసతి గృహం రూ.25 లక్షలతో అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రాషుగర్స్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.25లక్షలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. భవనం మరమ్మతులు, డైనింగ్ హాలు నిర్మాణం చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

పెనుగొండ, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఇలపర్రు గ్రామంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రి సభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కేతా సత్యనారాయణ, సభ్యులుగా చేకూరి నరసింహరాజు, నల్లి త్రిమూర్తులను సొసైటీ సబ్ డివిజనల్ అధికారి కేవీ రాజ్యలక్ష్మి ప్రమాణ స్వీకారం చేయించారు. ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, గుత్తుల లోకేశ్వరరావు, వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ చిట్టూరి సుబ్రహ్మణ్యం, బొబ్బిలి శ్రీను పాల్గొన్నారు

53 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మానవత్వంతో పని చేస్తోందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక మంత్రి కార్యాలయంలో ఆదివారం 53 మందికి రూ.22 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు (జీవి), ధనాని ప్రకాష్, మండాది అవినాష్, మీసాల రాము, అల్లం తాతాజీ పాల్గొన్నారు.



మండపాకలో యల్లారమ్మ.. ఆకివీడులో పెద్దింట్లమ్మ ఆలయాల మూత

చంద్ర గ్రహణంతో ఆలయాల మూసివేత

తణుకు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):చంద్రగ్రహణం కారణంగా తణుకు మండలంలోని పలు దేవాలయాలు ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి మూసివేశారు. ఆదివారం రాత్రి ఏర్పడే సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా తణుకు మండలంలోని దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి ఆలయం, మండపాకలోని యల్లారమ్మ ఆలయం, వేల్పూరులోని పలు దేవాలయాలను ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం వరకు మూసివేశారు.

ఆకివీడు: పెద్దింట్లమ్మ, వనువులమ్మ, భీమేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి, వెంకటలింగేశ్వరస్వామి, మాదివాడ భ్రమరాంబిక మల్లేశ్వర స్వామి, వెంకటేశ్వరస్వామి దేవస్థానాలతో పాటు గంగానమ్మ-మద్దిరావమ్మ, వరసిద్ధి వినాయక, అభయ,భక్తాంజనేయ తదితర పలు దేవాలయాలు మూసేశారు.

నరసాపురం టౌన్: పట్టణ, మండలంలోని పలు దేవాలయాలను ఆదివారం మూసివేశారు. సాయంత్రం నుంచి ఆదికేశవ ఎంబర్‌మన్నార్, కపిలమల్లేశ్వర, రాజగోపాలస్వామి, జగన్నాథ, మండలంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు. చంద్రగ్రహణం వీడిన తరువాత ఆలయాలను శుద్ధి చేసి తలుపులు తీయనున్నట్లు ఈవో రామచంద్రరావు తెలిపారు.

పెంటపాడు: మండలంలోని అన్ని ఆలయాలు మూతపడ్డాయి. పెంటపాడు బాలవెంకటేశ్వరస్వామి, కే.పెంటపాడు గోపాలస్వామి ఆంజనేయస్వామి తదితర ఆలయాలన్ని మూసివేశారు.

గణపవరం:మండలంలోని దేవాలయాలు మూసివేశారు. సోమవారం ఉదయం 9గంటలకు ఆలయ సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని అర్చకులు తెలిపారు. గణపవరంలో శ్రీదుర్గాంభసమేత సువర్ణేశ్వరస్వామి ఆలయం, గణపవరంలోని వెంకటేశ్వరస్వామి, అర్ధవరంలో బాలవెంకటేశ్వరస్వామి ఆలయం, పిప్పర, సరిపల్లె, జల్లికాకినాడ, కేశవరం గ్రామాల్లోని ప్రధాన దేవాలయాలను మూసివేశారు.

బండి ముత్యాలమ్మకు భక్తుల తాకిడి

మొగల్తూరు. సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకుని వారి మొక్కుబడులు చెల్లించారు. రాత్రి చంద్రగ్రహణం కావడంతో మధ్యాహ్నం నుంచి ఆలయాన్ని మూసివేశారు. ఆలయం వద్ద భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో మోకా అరుణ్ కుమార్ ఆలయ సిబ్బంది కల్పించారు.

ప్రకృతి వ్యవసాయ సాగుతో అధిక దిగుబడులు

మొగల్తూరు, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):వరి సాగులో రైతులు సామూహికంగా కషాయాలు పిచికారి చేయడం ద్వారా మేలైన దిగుబడులు సాధించడంతో పాటు తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చని ప్రకృతి వ్యవసాయం నరసాపురం డివిజన్ ఇన్‌చార్జి నర్సింహారావు తెలిపారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారితోట, కాసానివారివీధుల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో కషాయాలు డ్రోన్ సహాయంతో పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. వరి సాగులో కోడిగుడ్లు, నిమ్మరసం కషాయంతో పాటు 12 రకాల బ్యాక్టీరియాలు కలిపి పిచికారీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కుక్కల మహలక్ష్మీ, జి.కనకదుర్గా భవానీ, దుర్గాభవానీ, రామలక్ష్మీ రైతులు పాల్గొన్నారు.


కార్యవర్గ సభ్యుల్ని అభినందిస్తున్న విప్ నాయకర్, డీఎస్పీ శ్రీవేద

జిల్లా ఫొటో, వీడియోగ్రాఫర్స్ కార్యవర్గం

నరసాపురం టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫణి పంక్షన్ హాల్‌లో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ఫొటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణస్వీకారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా కెఎస్ఎస్ మూర్తి (క్యాపిటల్‌రాజు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ అధ్యక్షులుగా గోపిశెట్టి కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా లక్కు శేషు, మద్దాల ఏసు ప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా డి.ఏసురాజు, కోశాధికారిగా పెచ్చెటి సూర్యచంద్రరావు, జాయింట్ ట్రెజరర్‌గా పి.ధనేష్ కుమార్ ఎన్నికయ్యారు. వీరి చేత రాష్ట్ర సంక్షేమ సంఘం చైర్మన్ మదాల రమేష్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే నాయకర్, డీఎస్పీ శ్రీవేద అభినందించారు.

రెండు బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

నరసాపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 14 సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందన్నారు. ఆసక్తి గల వారు రూ.5లక్షలు రుసుం చెల్లించి దరఖాస్తును ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేయించుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9440902438కు సంప్రదించాలని సీఐ కోరారు.

సమాజ సంస్కరణకు గళమెత్తిన జాషువా

భీమవరం టౌన్, సెప్టెంబరు 7:(ఆంధ్రజ్యోతి): సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై గళమెత్తిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం జిల్లా శాఖ గ్రంథాలయంలో గుర్రం జాషువా జయంతోత్సవాలను ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తన సాహిత్యంతో సమాజంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని, కలాన్ని ఆయుధంగా మలచుకొని కుల వివక్షపై కవితాస్త్రాలను సంధించిన మహావ్యక్తి గుర్రం జాషువా అని అన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ సన్మాన్ అవార్డులు

పెనుగొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అఖిల భారత్ శ్రీ వాసవి పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ సన్మాన్-2025 అవార్డులను ప్రదానం చేయడం జరుగుతుందని ట్రస్టు ఉపాధ్యక్షుడు బొండాడ రాంపండు, ఎస్. సతీష్, కార్యదర్శి కెఎస్‌వీ రాజా తెలిపారు. ఆదివారం వాసవీ ధామ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో కోర్సు పూర్తి చేసి మెరిట్ ప్రమాణాలను కలిగి అర్హత కలిగిన విద్యార్థులు పది, ఇంటర్ తరగతులలో 90 శాతం, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ లలో డిస్టింక్షన్ లేదా అంతకంటే ఎక్కువ మార్కులు అదేవిధంగా డాక్టరేట్, రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ క్రీడా గౌరవాలను గెలుచుకున్నవారు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 15 లోపు పెనుగొండ కార్యాలయంలో వ్యక్తిగతంగా ఆర్యవైశ్య కమ్యూనిటీ ప్రూఫ్స్ జిరాక్సులతో సంప్రదించాలన్నారు. లేదా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునన్నారు. ఎంపిక కాబడిన విద్యార్థులను నగదు బహుమతి, సర్టిఫికెట్, ర్యాంక్ హోల్డర్‌లకు ప్రత్యేక వెండి పతకాలు అందజేస్తామన్నారు. ఈ సన్మాన కార్యక్రమం ఈ నెల 28న ఆదివారం ఉదయం 11 గంటలకు పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో జరుగుతుందన్నారు. అవార్డు గ్రహీతలకు వాట్సప్, మొబైల్ కాల్ ద్వారా మాత్రమే తెలియజేయబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9912018818 లేదా 08819246252 లకు సంప్రదించాలని కోరారు.

పెంట్లమ్మవారికి ప్రత్యేక పూజలు



పెంట్లమ్మ ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

పెంటపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా కే.పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారి శాన్వి నాయుడు పుట్టిన రోజు సందర్భంగా తల్లిదండ్రులు సౌరబ్ నాయుడు, శ్రీలక్ష్మి దంపతులు ఆలయానికి రూ.55 వేలు విరాళాన్ని అందజేశారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ఏరుబండి సతీష్ లు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో గంధం సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ పంతం శేఖర్, వీరాబత్తుల నాగేశ్వరరావు, నరాలశెట్టి సంతోష్‌కుమార్, మేడిచర్ల బన్ను పాల్గొన్నారు.

సేవ చేయడమే మానవ ధర్మం


పెదకృష్ణంరాజును సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి):సేవ చేయడం ద్వారానే మనిషి పరిపూర్ణ వ్యక్తిగా మారతాడనే తాను నమ్ముతానని ఆ నమ్మకంతోనే ట్రస్ట్ సేవలు చేస్తున్నామని ఆలంపురం వెంకటరమణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు పేర్కొన్నారు. ఆరుగొలనులో విశాలాక్షి, విశ్వేశ్వరస్వామివార్ల ఆలయం వద్ద ఆదివారం చిక్కాల సీతారామయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మాజీ సొసైటి అధ్యక్షుడు చిక్కాల సత్యనారాయణ నిర్మించిన భారీ షెడ్‌ను ఆదివారం పెదకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇటీవల ఢిల్లీ యూనివర్శిటీవారు పెదకృష్ణంరాజుకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడంతో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీతల బుచ్చిబాబు, నవాబుపాలెం సర్పంచ్ మద్దుకూరి ధనరాజు, ఉపసర్పంచ్ అడపా అప్పలరాజు పాల్గొన్నారు.

నాలుగు బార్‌లకు రీ నోటిఫికేషన్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెంలో మిగిలిన నాలుగు బార్‌లకు రీ నోటిఫికేషన్ వెలువడిందని ఈ లైసెన్స్‌లకు ఈనెల 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం వైన్‌షాపు డీలర్‌లతో బార్‌ల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. గతంలో దరఖాస్తు ఫీజు రూ.10లక్షలు ఉండగా ప్రస్తుతం ఆ ఫీజు రూ.5.10లక్షలకు తగ్గించడమే కాకుండా బార్‌ల పనివేళలు పెంచారని తెలిపారు. మద్యం షాపు పాడుకుని పర్మిట్ రూం ఫీజు చెల్లించడానికి రూ.71.5 లక్షలు చెల్లించాల్సి వస్తుండగా బార్‌లకు అవే సదుపాయాలతో రూ.55లక్షలు చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. మద్యం షాపు కాలపరిమితి రెండు సంవత్సరాలు కాగా బార్‌ల కాలపరిమితి మూడేళ్లని తెలిపారు. పై విషయాలు అన్ని పరిశీలించి ఔత్సాహికులు బార్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపు గూడెంలో అన్నదాత పోరు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 9న తాడేపల్లిగూడెంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఆయన నివాసం వద్ద ఆదివారం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల బ్లాక్‌మార్కెట్ నివారించాలని, ఉచిత పంటల బీమా, రైతులకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

సుంకాలు ఉపసంహరించుకోవాలి

తణుకు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత్‌పై అమెరికా వేసిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, అడ్డగర్ల అజయుమారి డిమాండ్ చేశారు. ఆదివారం నరేంద్ర సెంటర్‌లో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో భారత్‌పై అమెరికా సుంకాలు వేయడాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని, అమెరికాలో ఉన్న భారతీయులుపై ట్రంప్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని నినాదాలు చేశారు.

జుత్తిగలో జేసీ ఆకస్మిక తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

పెనుమంట్ర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జుత్తిగ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడా కూడా ఎరువుల కొరత లేదని ముఖ్యంగా యూరియా కొరత లేదని ఆయన తెలియజేశారు యూరియా గురించి ఆందోళన చెందవద్దని రైతులకు సూచించారు. డీలర్లు ఎక్కడా కూడా ఎమ్మార్పీకు మించి గాని అలాగే ఎరువుల కొరతను కృత్రిమంగా సృష్టిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సరోజనీ మృతి టీడీపీకి తీరని లోటు


సరోజనీ (ఫైల్)

పెనుమంట్ర, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ కలిగిపూడి సరోజినీ మృతి తెలుగు దేశం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం బ్రాహ్మణ చెరువులో కలిగిపూడి సరోజినీ భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దంపతులు సందర్శించి నివాళులర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి, మాజీ టీడీపీ అధ్యక్షుడు తమానంపూడి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన

ఆచంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):వల్లూరులో డ్రోన్ ద్వారా పిచికారి చేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలో పలు అంశాలపై డివిజన్ ఇన్‌చార్జి ఇ.ఈరన్న గౌడ్ ఆధ్వర్యంలో వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోడిగుడ్డు నిమ్మరసం బయో కల్చర్ వేప గింజల కషాయం పాలింగువ స్ప్రేయింగ్ చేయించడం వల్ల మొక్క ఎదుగుదలకు అన్ని రకాల క్రిమి కీటకాలను నివారించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు తోట ఆదినారాయణ, గెద్దాడ శ్రీను, వీఏఏ కీర్తన, రైతులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఉల్లిపాయలు

పెనుగొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి):పెనుగొండ వ్యవసాయ మార్కెట్‌లో తక్కువ ధరకే ఉల్లిపాయలు విక్రయించడానికి నిర్ణయించినట్టు పెనుగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బడేటి వీరబ్రహ్మం తెలిపారు. ఆదివారం మార్కెట్ కమిటీలో తక్కువ ధరకే ఉల్లిపాయలు విక్రయం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబీ భాస్కర్ , డైరెక్టర్‌లు ఎస్.రామదాసు, బి. కల్యాణి, సెక్రటరీ పి. రామారావు, సూపర్ వైజర్ డి. నరసింహరావు పాల్గొన్నారు